## క్లుప్తంగా

### సీఎంకు ఘన స్వాగతం



విశాఖ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ మంగళవారం కలిశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు వచ్చిన సీఎంకు ఆయన పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

### హెచ్ఎం చొరవతో గోతులు పూడ్చివేత



క్రషర్ బుగ్గి వేయిస్తున్న హెచ్ఎం నాగేశ్వరరావు

**రావికమతం:** హెచ్ఎం నాగేశ్వరరావు చొరవ తీసుకుని కొత్తకోట హైస్కూల్ గేటు ఎదురుగా బురద గోతులను మంగళవారం కప్పి వేయించారు. ఇటీవల టెలిఫోన్ కేబుల్స్ వేసేందుకు ఇక్కడ మెయిన్ గేట్‌కు ఎదురుగా పెద్ద గోతులు తీసి ఆ సంస్థ నిర్లక్ష్యంగా వదిలేసింది. ఇటీవల వర్షాలకు అందులో నీరు చేరడంతో విద్యార్థులతోపాటు ఇతరులు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో హెచ్ఎం చొరవ చూపి రోలుగుంట నుంచి క్రషర్ బుగ్గి లారీతో తెప్పించి గోతులను పూడ్చి వేయించారు. పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

### చురుగ్గా ఆర్లిలోవ రోడ్డు పనులు



రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

**గొలుగొండ:** కృష్ణదేవిపేట–నర్సీపట్నం ప్రధాన మార్గం ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేయడంతోపాటు అటవీ శాఖకు 5.20 ఎకరాల భూమి కేటాయించింది. ప్రస్తుతం 3.5 కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా పనులు పూర్తి చేశారు. 24 అడుగుల రోడ్డు విస్తీర్ణం పనులు దాదాపుగా పూర్తయ్యాయి. నెల రోజులపాటు రోడ్డు నాణ్యతగా ఉండేందుకు రోలర్‌తో పనులు నిర్వహించామని అధికారులు తెలిపారు. తర్వాత తారు పూతతో పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మిస్తామని అర్అండ్‌బీ జేఈ ప్రసాద్ తెలిపారు.

### 89 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సుబ్రహ్మణ్యం

**కె.కోటపాడు:** మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలను పాటించడం ముఖ్యమని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం పాచిలవానిపాలెంలో ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమాన్ని నిర్వహించారు. 89 మందికి ఓ.పి ద్వారా వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలతో పాటు జాగ్రత్తలను వివరించారు. హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, రమణ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### సీపీఐ సీనియర్ నాయకుడు దేముడు మృతి



దేముడు(ఫైల్)

**నర్సీపట్నం:** సుదీర్ఘకాలం పాటు సర్పంచ్‌గా పని చేసిన సీపీఐ సీనియర్ నాయకుడు మాకిరెడ్డి దేముడు(95) మంగళవారం తన స్వగ్రామం గబ్బాడలో మృతి చెందారు. భూస్వామి కుటుంబంలో పుట్టిన ఆయన 1963 నుంచి కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు చేసి ఈ ప్రాంత ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. విలువలతో కూడిన జీవితాన్ని గడిపారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సీపీఎం నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, కోటేశ్వరరావు, రాజు, గౌరీ ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు.



# లంపీస్కిన్ నివారణకు ఉచిత టీకాలు

**పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు**



పశువైద్యాధికారి మంజూష

**రోలుగుంట:** పాడి పశువులకు సీజనల్‌గా సోకుతున్న లంపీ స్కిన్ నియంత్రణకు ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేయిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి బి.ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమాన్ని మండలంలోని జె.నాయుడుపాలెంలో ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వ్యాధి తీవ్రత, ఎలా సోకుతుంది, అందించాల్సిన వైద్యం, పాటించాల్సిన జాగ్రత్తలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ప్రథమంగా శరీరంపై వివిధ భాగాల్లో బొబ్బలు, ముక్కు, నోటి నుంచి స్రావాలు వంటి లక్షణాలుంటే వెంటనే సమీప గోపాల మిత్రలకు సమాచారం ఇవ్వాలన్నారు. పశు వైద్య కేంద్రాల వద్ద ప్రభుత్వ ఉచితంగా ఇస్తున్న లంపీ స్కిన్ టీకాలను వేయించాలన్నారు. గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటు చేయనున్నామన్నారు. అనంతరం గోపాల మిత్రలు సన్యాసినాయుడు, చిన్నంనాయుడు పాల్గొని పాడి పశువులకు సేవలందించారు. పశువైద్యాధికారి నూకేశ్వరరావు పాల్గొన్నారు.



జె.నాయుడుపాలెంలో పాడి పశువులకు టీకా వేస్తున్న పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ప్రసాదరావు

**మాడుగుల రూరల్:** లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం మాడుగుల గల్లా వారి కళ్లాల వద్ద ప్రారంభించారు. పశువులకు ఈ టీకాలను ఈ నెల 31వ తేదీ వరకు ఉచితంగా వేస్తామని మాడుగుల ఏరియా పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు మంగళవారం తెలిపారు. తొలిరోజు 95 పశువులకు టీకాలు వేశామన్నారు. చీడికాడ, మాడుగుల మండలాలకు సంబంధించిన పశువైద్యశాలలకు టీకాలు అందించినట్లు తెలిపారు.

**లంపీస్కిన్ నివారణ టీకా తప్పనిసరి**

**దేవరాపల్లి:** ప్రతి ఆవుకు లంపీ స్కిన్ (ముద్ద చర్మ వ్యాధి) నివారణ టీకాను తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి కె.మంజూష అన్నారు. ఎం.అలమండ పశువైద్యశాలలో మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ టీకా కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ప్రమాదకర ఈ వ్యాధి తీవ్రత ఆవుల్లో అధికంగా ఉంటుందన్నారు. గతేడాది కొన్ని పశువుల్లో దీని లక్షణాలను గుర్తించామని, ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ముందస్తుగా ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. ఈ టీకాలు రైతు భరోసా కేంద్రాలతోపాటు పశు వైద్య కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. రైతులు నిర్లక్ష్యం వహించకుండా ఆవులకు టీకా వేయించాలని కోరారు.

# పార్టీ గెలుపునకు అంకిత భావంతో పని చేయండి

**వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు**



హాజరైన సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు



మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు

**నాతవరం:** రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలంటే, ఇప్పట్నుంచే ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు కోరారు. ఆయన అధ్యక్షతన మంగళవారం నాతవరంలో పార్టీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలు, పార్టీ లోటుపాట్లను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు చర్చించారు. వీటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి మాట్లాడుతూ ఎమ్మెల్యేను గెలిపించుకుంటేనే మనందరికి రాజకీయ భవిష్యత్తు ఉంటుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలతో పని లేకుండా అందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటుబ్యాంకుగా మలుచుకోవాలన్నారు. టీడీపీ హయాంలో చేయలేని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేస్తున్నామన్నారు. తాను సరుగుడు సర్పంచ్‌గా గతంలో ఉన్నప్పుడు పార్టీ మారాలని, అప్పటి మంత్రి అయ్యన్నపాత్రుడు రూ.10 లక్షలు ఎరచూపారన్నారు. దీనికి అంగీకరించకపోవడంతో తన చెక్ పవర్ రద్దు చేశారని, కేసులు పెట్టారని వాపోయారు. వైఎస్సార్‌సీపీని నమ్ముకుని ఉన్నందుకు ఎమ్మెల్యే ఆశీస్సులతో ఇప్పుడు ఎంపీపీగా పని చేస్తున్నానని భావోద్వేగం వ్యక్తం చేశారు. ప్రతి పంచాయతీ నుంచి కొత్త ఓటర్లను చేర్పించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఉలబాల శ్రీను, సబ్బవరపు వెంకునాయుడు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు పాల్గొన్నారు.

# దోమల నివారణతో వ్యాధులు దూరం

**ఆశ కార్యకర్తల సమావేశంలో డీఎంవో వరహాలుదొర**



మాట్లాడుతున్న డీఎంవో వరహాలుదొర

**మాడుగుల రూరల్:** వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి కె. వరహాలుదొర తెలిపారు. ఆశ దినోత్సవాన్ని పురస్కరించుకుని కె.జె.పురం పీహెచ్‌సీలో మంగళవారం ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మలేరియా ఇంటింటి సర్వేను నిర్వహించి, వివరాలు అప్‌లోడింగ్ చేయాలని సూచించారు. ఇప్పటికే రెండు సార్లు దోమలు మందును గ్రామాల్లో పిచికారీ చేయించామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే, ఫ్రైడేను పురస్కరించుకోని ఇంటింటికి వెళ్లి దోమలు నివారణలో భాగంగా కొబ్బరిబొండాలు, రుబ్బురాళ్లలో నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో మైదాన, గిరిజన గ్రామాల్లో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు ప్రబలవన్నారు. వైద్యాధికారి కె. లీలాప్రసాదు మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలన్నారు. ఐదో విడత మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమం గురించి సమావేశంలో సమీక్షించారు. మలేరియా, వ్యాధులు, వాటి నివారణ గురించి గేయాల రూపంలో సీహెచ్‌వో సిహెచ్. పుష్పమ్మ ఆలపించారు. కార్యక్రమంలో హెచ్‌వీ పుష్పకాంతం, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

# అటవీ హక్కు పత్రాలిచ్చి ఆదుకోవాలి

**తహసీల్దార్‌కు ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేతల వినతి**




తహసీల్దార్ శ్రీనివాసనాయుడుతో చర్చిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ సునీల్

**నాతవరం:** గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి కోరారు. మంగళవారం ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాసనాయుడుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సరుగుడు సుందరకోట, కె.వి.శరభవరం పంచాయతీల్లో పోడు సాగు చేసుకునే వారికి 550పైగా అటవీ హక్కు పత్రాలు రెండు విడతలుగా పంపిణీ చేశారన్నారు. వీరంతా వైఎస్సార్ రైతు భరోసా సాయం పొందుతున్నారన్నారు. పోడు సాగు భూములను ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో చేర్పించదన్నారు. ఈ ప్రయోజనాలు పొందాలంటే మాసంపల్లి, దద్దుగుల, రామన్నపాలెం, యరకంపేట, సిరిపురం, తొరడ, రాజవరం, అచ్చంపేట, తదితర గిరిజన గ్రామాల్లో అర్హత కలిగిన గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. మండల వ్యాప్తంగా రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. వీటిపై తహసీల్దార్ స్పందించి క్షేత్రస్థాయి పరిశీలించి హక్కు పత్రాలు ఇస్తామన్నారు. ఈ నెల 21వ తేదీలోపు 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా చేర్పించేందుకు ప్రజాప్రతినిధులంతా సహకరించాలన్నారు. వైస్ ఎంపీపీ పైల సునీల్, గునుపూడి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు వేముల సూర్యనారాయణ, పోలుపర్తి వెంకటరమణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంకు సాంబమూర్తి, గుడపర్తి అచ్చియ్యనాయుడు, ఇట్టంశెట్టి శ్రీనువాస్ పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణలో నా షాపులు కూల్చేయమన్నా..

**ఎం.బెన్నవరం మాజీ సర్పంచ్ శిరుసుపల్లి నర్సింగరావు**



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ శిరుసుపల్లి నర్సింగరావు

**నాతవరం:** ప్రజల శ్రేయస్సు కోసం నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణలో కోట్లు విలువ చేసే తన షాపుల భవనాలు స్వచ్ఛందంగా కూల్చివేయాలంటూ ఎమ్మెల్యేకు స్వయంగా అంగీకారం తెలిపానని ఎం.బెన్నవరం మాజీ సర్పంచ్ శిరుసుపల్లి నర్సింగరావు అన్నారు. మంగళవారం నాతవరంలో వైఎస్సార్ సీపీ సమావేశానికి విచ్చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తనకు నర్సీపట్నం మున్సిపాలిటీ మెయిన్ రోడ్డుకు ఆనుకోని షాపింగ్ కాంప్లెక్సుతోపాటు విలువైన భవనాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం రూ.3 కోట్లకు పైగా ఉంటుందన్నారు. జిరాయితీ స్థలమైనప్పటికీ వీటిని కూల్చివేసేందుకు అభ్యంతరం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్లు కోసం భయపడకుండా అన్ని వర్గాల శ్రేయస్సు కోసం ఎమ్మెల్యే దగ్గరుండి రోడ్డు విస్తరణ చేయడం హర్షణీయమన్నారు. గత టీడీపీ హయంలో రోడ్లు విస్తరణ పేరిట రాజకీయ లబ్ధి పొందారని విమర్శించారు.

## 95 శాతం పింఛన్ల పంపిణీ



దివ్యాంగ చిన్నారికి పింఛను అందజేస్తున్న వలంటీరు

**మాడుగుల రూరల్:** వైఎస్సార్ పింఛను కానుక కింద గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులు, వృద్ధులు, వితంతులు, ఒంటరి మహిళలకు పింఛన్లు అందిస్తున్నారు. కేజేపురంలో దివ్యాంగ చిన్నారికి వలంటీరు మహేష్ పింఛన్ అందించాడు. తొలి రోజు 95 శాతం పింఛన్లు పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో మీనాకుమారి తెలిపారు.

## రైవాడ కెనాల్‌లో నాచు తొలగింపు

**కె.కోటపాడు:** మండలంలో రైవాడ కెనాల్ మార్గంలో నాచు, పిచ్చి మొక్కల తొలగింపు పనులను జీవీఎంసీకి చెందిన లస్కర్లు చురుగ్గా చేస్తున్నారు. ఈ పనులను మంగళవారం ఉగ్గినవలస–కొరువాడ గ్రామాల మధ్య కెనాల్‌లో చేపట్టారు. కెనాల్ అడుగుభాగంలో నాచు, పిచ్చిమొక్కలు పెద్ద ఎత్తున పేరుకుపోవడంతో రైవాడ జలాశయం నుంచి విశాఖ నగరానికి రోజూ 50 క్యూసెక్కుల నీటి ప్రవాహంలో అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ చర్యలు చేపడుతున్నారు.

## మున్సిపల్ కార్మికుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

**నర్సీపట్నం:** సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పెదబొడ్డేపల్లి జంక్షన్ నుంచి మున్సిపల్ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని ఆందోళన నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అధికారులు వేధింపులు ఆపాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలన్నారు. జనాభా ప్రాతిపదికన సిబ్బందిని నియమించి కార్మికులకు పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు పాల్గొన్నారు.

## ఘనంగా సియోను ప్రార్థన మందిర వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న బిషప్ గొర్లె టైటస్ తదితరులు

**దేవరాపల్లి:** కాశీపురం సీయోను ప్రార్థన మందిరం 45వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. నిస్సీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు బిషప్ డాక్టరు గొర్లె టైటస్ కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశాఖపట్నానికి చెందిన బిషప్ స్టీఫెన్ ప్రసాద్, జాని హెన్రీ, ఆంటోని రాజ్ వ్యాఖ్యోపదేశం చేశారు. కార్యక్రమంలో డాక్టరు రాజేష్, సీయోను ప్రార్థన మందిరం వ్యవస్థాపకుడు ఫిలేమోన్, దావీద్, ఇమ్మానియేల్ డేవిడ్ పాల్, నోవ, డాక్టర్ అబ్రహం, పాస్టర్లు పాల్గొన్నారు.

## కళ్ల కలక నివారణ మందు పంపిణీ



విద్యార్థులకు ఐ డ్రాప్స్ వేస్తున్న క్లబ్ ప్రతినిధులు

**నర్సీపట్నం:** నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, పలు వసతి గృహాల్లో కళ్ల కలకతో బాధపడుతున్న విద్యార్థులకు రూ.6 వేల విలువ కంటి చుక్కల మందు పంపిణీ చేశారు. అధ్యక్షుడు జి.చంద్రరాజు, కార్యదర్శి మళ్ల గణేష్, డైరెక్టర్ వెలగా నారాయణరావు అందజేశారు.

# ఎమ్మెల్యే గణేష్ చిత్రపటానికి క్షీరాభి షేకం



ఎమ్మెల్యే గణేష్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

**గొలుగొండ:** ఎన్నోయేళ్లుగా రోడ్ల సమస్యలపై ఇబ్బందులు పడుతున్న నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మోక్షం కల్పించారని వైస్ ఎంపీపీ జక్కు నాగమణి తెలిపారు. మంగళవారం జోగుంపేటలో ఎమ్మెల్యే గణేష్ చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ఆమె క్షీరాభిషేకం చేశారు. ఆరిల్లోవ రోడ్డు ఏర్పాటుతో పాటు నర్సీపట్నం పట్టణంలో రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే తీసుకున్న చర్యలతో వేలాది మంది ప్రజలకు రవాణా కష్టాలు తొలగాయని హర్షం వ్యక్తం చేశారు. ప్రజా శ్రేయస్సు కోసం పనిచేస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని కోరారు.

# ప్రభుత్వానికి పేరు తెచ్చేలా పనిచేయాలి

**ఎంపీపీ సుర్ల రాజేశ్వరి**



మాట్లాడుతున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి

**నర్సీపట్నం:** ప్రభుత్వానికి పేరు తెచ్చేలా అధికారులు పని చేయాలని ఎంపీపీ సుర్ల రాజేశ్వరి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లను సమన్వయం చేసుకుని సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించాలన్నారు. గ్యాస్ కనెక్షన్లు తీసుకోలేకపోయినా తీసుకున్నట్టు జాబితాలో చూపిస్తున్నారని ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు సభ దృష్టికి తీసుకెళ్లారు. పరిశీలించి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్నాజీరావు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎంపీటీసీ బోళం చినబాబు కోరారు. రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలని ఎంపీపీ ఏవోకు సూచించారు. అనంతరం ఆయా శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాల ప్రగతిని అధికారులు వివరించారు. జెడ్పీటీసీ సుకల రమణమ్మ, ఏవో రమణబాబు, వైస్ ఎంపీపీలు తాతబాబు, ఇన్నం రత్నం పాల్గొన్నారు.

# సమష్టి కృషితోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

**మాకవరపాలెం:** పింఛనుదారులంతా సమష్టిగా కృషి చేస్తేనే సమస్యలను పరిష్కరించుకోవచ్చని ప్రభుత్వ పింఛనుదారుల సంఘ జిల్లా అధ్యక్షుడు డి.డి.ప్రసాదరావు అన్నారు. మంగళవారం మాకవరపాలెం పింఛనుదారుల యూనిట్ 18 వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ బలోపేతమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మండల సంఘం అధ్యక్షుడు కె.రామారావు మాట్లాడుతూ పింఛనుదారుల సమస్యలను ఎప్పటికప్పుడు ట్రెజరీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. అనంతరం నర్సీపట్నం, కోటవురట్ల ట్రెజరీ అధికారులు నాగేశ్వరరావు, గణేష్, రామారావు మాట్లాడారు. వీరితోపాటు మండల సంఘ సభ్యుడు అచ్చేశ్వరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పింఛనుదారుల సంఘ కార్యదర్శి రంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికడదాం



మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

**దేవరాపల్లి:** బాల్య వివాహాలను అరికట్టి ఆడబిడ్డలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) ఏపీఎం ఎస్.ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం తెనుగుపూడిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా రహదారి భద్రతా వారోత్సవాలు, బాల్య వివాహాలు, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లల్లో రక్త హీనతను నివారించాలని, ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, పురుషులతో సమానంగా చదివించాలని నినాదాలు చేశారు. మైనర్ల డ్రైవింగ్ చట్ట రీత్యా నేరమని, వాహనం నడిపే వారికి లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. చిరుధాన్యాల సాగు చేయాలని ఎంపీడీవో సూచించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు, మండల విద్యాశాఖ అధికారి పడాల్‌దాసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య శాఖ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయ

**రావికమతం:** తల్లిపాలు బిడ్డకు అమృతం వంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ అన్నారు. తల్లిపాల వారోత్సవాలు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 7వ తేదీ వరకూ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కొత్తకోట సెక్టార్‌లోని పది సెంటర్ల పరిధిలోని బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు అర గంటలోపు ముర్రుపాలు తాగిస్తే జీవితాంతం రోగనిరోధక శక్తి ఇస్తుందన్నారు. ప్రతి తల్లి ఆర్నెల్ల వరకూ తల్లిపాలనే బిడ్డ కు ఇవ్వాలన్నారు. ఆపై పోషకాహారంతోపాటు ఏడాది వరకు తల్లిపాలు ఇస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో కొత్తకోట పీహెచ్‌సీ ఎంఎల్‌హెచ్ పి.సౌజన్య, ఏఎన్ఎం వరలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హెచ్ఎం వీరాంజనేయులు దాతృత్వం

**విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**



విద్యార్థులకు అందించిన టీషర్ట్‌లు, విద్యా సామగ్రి

**కె.కోటపాడు:** పాచిలవానిపాలెం ఎంపీపీ పాఠశాల హెచ్ఎం వీరాంజనేయులు దాతృత్వం చాటుకున్నారు. తన సొంత నగదుతో సమకూర్చిన ఏకరూప టీషర్ట్‌లు, ఇతర విద్యా సామగ్రిని ఇక్కడ ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న 26 మంది విద్యార్థులకు వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, ఎంఈవో–1 కె.సత్యనారాయణ మంగళవారం పంపిణీ చేశారు. హెచ్ఎం ప్రోత్సాహంతో ప్రతి విద్యార్థి చదువుల్లో మంచి ప్రతిభ చూపాలని ఎంఈవో–1 తెలిపారు. హెచ్ఎంను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్పీ భారతి, ఉపాధ్యాయిని ఎల్.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా వరినాట్లు



రాచపల్లి ప్రాంతంలో వరినాట్లు

**మాకవరపాలెం:** పల్లపు ప్రాంతాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది వర్షాలు సకాలంలో అనుకూలించడంతో రైతులు ఉంతో ఉత్సాహంతో వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఏటా ఖరీఫ్‌లో మండలంలో 1,200 హెక్టార్ల వరకు వరిసాగు అవుతోంది. ఈ నేపథ్యంలో పల్లపు గ్రామాలైన మల్లవరం, గిడుతూరు, తామరం, మాకవరపాలెం, జంగాలపల్లి, కొండలఅగ్రహారం, పి.పి.అగ్రహారం, రాచపల్లి ప్రాంతాల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. మరో పది రోజుల్లో మండల వ్యాప్తంగా నాట్లు పూర్తవుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

**చెరువుల్లో జలకళ**

**మాడుగుల రూరల్:** అడపా దడపా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లో జలకళ సంతరించుకుంది. దీనికి తోడు పాలగెడ్డ, ఉరకగెడ్డ, తారకరామ జలాశయంలో నీరు సమృద్ధిగా చేరుతోంది. దీంతో ఆయకట్టు పరిధిలో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.